సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



రోడ్ల విస్తరణను అడ్డుకోవద్దు

పాడేరులో రోడ్ల అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరుతూ గిరిజనులు శాంతియుత నిరసన చేపట్టారు. 8లో



ఏవోబీలో రెడ్ అలర్ట్

ఏవోబీలో రేపటి నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. 8లో



వెంకటాద్రిపై అఖండ దీపోత్సవం

కార్తీకమాసం ముగింపు సందర్భంగా పెందుర్తి వెంకటాద్రిపై తొలిమెట్టు నుంచి శిఖరం వరకు అఖండ దీపోత్సవం నిర్వహించారు.

మాటలు లేని కాలంలో ఆదివాసీలు లయబద్ధంగా వేసిన గెంతులే నేడు ప్రపంచదేశాల్లో గొప్ప నృత్యంగా వెలుగొందుతున్నాయి. అలాంటి వాటిలో ఒకటైన గిరిజనుల కొమ్ముకోయ నృత్యం అత్యంత పురాతన కళారూపంగా ప్రసిద్ధి చెందింది. కోయ జాతి గిరిజనులు మాత్రమే చేసే ఈ నృత్యం దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందింది. ఈ నృత్యం పేరు చెబితే చింతూరు మండలంలోని కోయజాతికి చెందిన కళాకారులు గుర్తుకువస్తారు.



పతాక స్థాయిలో కొమ్ముకోయ నృత్యం

- పురాతన కళారూపం ఆదివాసీల కొమ్ముకోయ నృత్యం
- సంప్రదాయ ప్రదర్శనలతో ఆదాయం
- ప్రత్యేకత చాటుతున్న కోయజాతి కళాకారులు
- కామన్‌వెల్త్, ఐపీఎల్‌లో ప్రదర్శనలు

SUNDAY SPECIAL

కొండకోనల్లో నృత్య సౌందర్యం



దోలు వాయిస్తున్న కళాకారులు

చింతూరు: సంస్కృతి, సంప్రదాయంలో భాగమైన కొమ్ముకోయ నృత్యంతో తమ ప్రత్యేకతను దేశం నలుమూలలా చాటుతున్నారు కోయజాతికి చెందిన గిరిజన కళాకారులు. ఈ నృత్యం పేరు చెబితే మండలంలోని తుమ్మలకు చెందిన గిరిజన కళాకారులు ముందుగా గుర్తుకొస్తారు. సొంత శుభకార్యాలతో ప్రారంభమైన ఈ నృత్యం రాష్ట్రంలో వివిధ పండుగల సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఓ భాగమైంది. అనంతర కాలంలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు కామన్‌వెల్త్ గేమ్స్, ఐపీఎల్ ప్రారంభం, ముగింపు సంబరాల్లో సైతం ఈ నృత్యం ఎంతో ప్రాచుర్యం పొందింది.

20 బృందాలు...

మండలంలో తుమ్మలతో పాటు బుర్కనకోట, సరివెల, వేకవారిగూడెం, సుద్దగూడెం తదితర గ్రామాలకు చెందిన గిరిజన కళాకారులు సైతం ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 20 బృందాల వరకు ఉన్నాయి. ఈవెంట్‌ను బట్టి ఒక్కో బృందంలో 20 నుంచి 40 మంది మహిళలు, పురుషులు ఉంటారు.

- గిరిజన సంస్కృతికి తగ్గట్టుగా దుస్తులు ధరించి పురుషులు అడవి బర్రె కొమ్ములను పోలిన ఆకృతులు, నెమలి ఈకలతో కూడిన తలపాగా చుట్టుకుని, పెద్ద డోలు పట్టుకుని దానిని వాయిస్తూ ఉంటారు. మహిళలు తలకు రిబ్బన్ చుట్టుకుని అందులో ఈకలను పెట్టుకుని, కాళ్లకు గజ్జెలు కట్టుకుని పురుషుల డోలు వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తుంటారు. ముందు నెమ్మదిగా ప్రారంభమయ్యే ఈ నృత్యం క్రమేపీ పుంజుకుంటుంది.
- నృత్యం ముగింపులో పొట్టేళ్ల మాదిరిగా పురుషులు తమ కొమ్ములతో ఒకరినొకరు గుద్దుకోవడం ప్రత్యేక ఆకర్షణ.

దుస్తుల అలంకరణ వైవిధ్యంగా ఉంటుంది. పురుషులు ఎర్ర దుస్తులు ధరిస్తే మహిళలు పచ్చ దుస్తులు ధరిస్తారు.

ప్రస్థానమిలా..

చింతూరు మండలం తుమ్మలకు చెందిన పత్రా ముత్యం తమ గ్రామానికి చెందిన కొంతమంది కళాకారులతో కలసి ఓ బృందాన్ని ఏర్పాటుచేసి వివిధ పాంతాల్లో ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా కొమ్ముకోయ నృత్య ప్రస్థానం ప్రారంభమైంది. ఆయన మృతి అనంతరం అతని కుమారుడు రమేష్ సంప్రదాయ వృత్తిగా ఈ నృత్యాన్ని కొనసాగిస్తున్నారు.

సాంస్కృతిక విభాగాల ఆధ్వర్యంలో..: సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేశంలో, రాష్ట్రంలో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో కొమ్ముకోయ నృత్య కళాకారుల ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నారు. వివిధ పండుగల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా వీరు పాల్గొంటున్నారు.

- మన్యంలో చిత్రీకరించే కొన్ని సినిమాల్లో సైతం కొమ్ముకోయ నృత్య ప్రదర్శనకు చోటు దక్కింది. పుష్ప–2, గేమ్‌చేంజర్, దేవదాసు–2, ఊరిపేరు భైరవకోన, దొంగలబండి, అమ్మాయినవ్వితే.. శ్లోకం వంటి చిత్రాల్లో తమ ప్రదర్శనకు అవకాశం వచ్చినట్టు నృత్య కళాకారులు తెలిపారు.

రోజుకు రూ.వెయ్యి

- ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు రవాణా ఖర్చులు, వసతి కల్పించడంతో పాటు ఒక్కొక్కరికీ రోజుకు రూ. వెయ్యి చొప్పున చెల్లిస్తారని వారు పేర్కొన్నారు. ఒకొక్క కళాకారుడు ఏడాదికి సుమారు రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందుతుంటారు.
- ఎంతో ఖ్యాతి పొందినా కళాకారులు మాత్రం వ్యవసాయం, కూలిపనులపై కూడా ఆధారపడుతుంటారు.



రిసార్ట్ వద్ద నృత్యం చేస్తున్న కొమ్ముకోయి కళాకారులు

ఐటీడీఏ సహకరించాలి



కొమ్ముకోయ నృత్యం ద్వారా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా చాటుతున్న తమకు సహకారం అందించాలి. ఐటీడీఏ ద్వారా తమకు మరిన్ని అవకాశాలు కల్పిస్తే తాము ప్రదర్శనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. – పత్రా రమేష్, కొమ్ముకోయ కళాకారుడు, తుమ్మల

ఎంతో ఆదరణ



ఆదివాసీ సంస్కృతిలో భాగంగా ప్రకృతి ఒడిలో తాము నేర్చుకున్న ఈ నృత్యానికి ఇతర ప్రాంతాల్లో ఎంతో ఆదరణ లభిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనల ద్వారా అక్కడి సంస్కృతిని తాము తెలుసుకునే అవకాశం కలుగుతోంది. ప్రభుత్వం నుంచి మాలాంటి కళాకారులకు పూర్తిస్థాయిలో సహకారంఅందించాలి. – వుయికా సీత, కొమ్ముకోయ నృత్య కళాకారిణి

గిరిజనులు వాగులు దాటొద్దు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: తుపాను ప్రభావం వల్ల ఏజెన్సీలో వాగులు పొంగే ప్రమాదం ఉన్నందున వాటిని ఎట్టి పరిస్థితుల్లో గిరిజనులు దాటవద్దని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో వివిధ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, పీఆర్ అధికారులు ఎప్పకప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. కొండవాగుల వద్ద భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను సహాయక చర్యల నిమిత్తం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను 9441 058457, 9429 20383, టోల్ ఫ్రీ: 08864–243561 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘాట్‌లో మంచు వాన



సాక్షి,పాడేరు: పాడేరు, అనంతగిరి ఘాట్ రోడ్లలో పొగమంచుతో పాటు వర్షం కురవడంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మధ్యాహ్న సమయంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంది. పాడేరు ఘాట్‌లోని డల్లాపల్లి, మోదాపల్లి, గుర్రగరువు ఆదివాసీ గ్రామాలను పొగమంచు కమ్ముకుంది.

నేడు వైజాగ్ మారథాన్

విశాఖ స్పోర్ట్స్ : వైజాగ్ మారథాన్ మూడో ఎడిషన్ ఆదివారం సాగర తీరంలో జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు విభాగాల్లో పరుగు నిర్వహించనున్నారు. ఔత్సాహికుల్ని ప్రోత్సహించేందుకు సరదా రన్‌గా మూడు కిలోమీటర్ల పరుగును ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్నారు. ఇక మిగిలిన మూడు విభాగాల్లో విజేతలకు ఐదు లక్షల నగదు ప్రోత్సాహకాల్ని పంచనున్నారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సన్నాహకంగా ఈ వైజాగ్ మారథాన్‌ను పోలీస్, జీవీఎంసీ సహకారంతో నిర్వహించనున్నారు. సాగర తీరంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ఉదయం 5 గంటలకు హాఫ్ మారథాన్, 5.30 గంటలకు 10 కిలోమీటర్ల పరుగు, 6.15 గంటలకు 5 కిలోమీటర్ల పరుగు ప్రారంభం కానుంది.

న్యూస్‌రీల్

ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు

- కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో దినేష్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టిపెట్టి సమాజంలో ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. శనివారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ నేపథ్యాలు, ఆర్థిక పరిస్థితులు, తల్లిదండ్రుల వృత్తి వివరాలను తెలుసుకున్నారు. వారి ఆశయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ గైడెన్స్,కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్,రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షలపై కలెక్టర్ అవగాహన కల్పించారు.అనంతరం వారికి ఆంగ్ల నిఘంటువులను పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



కొత్తపాడేరులో సామాజిక పింఛనుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: సామాజిక పింఛన్ల పంపిణీ ఒకరోజు ముందుగానే చేపట్టామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన కొత్తపాడేరులో సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లాలో 1,23,875 మంది సామాజిక పింఛనుదారులకు ప్రభుత్వం రూ.51కోట్ల 65లక్షల 4వేలు విడుదల చేసిందన్నారు. తొలిరోజు రాత్రి 7గంటల సమయానికి 1,16,340మంది పింఛన్‌దారులకు రూ.48కోట్ల 47లక్షల 13వేల 500 పంపిణీ చేసి 93.92 శాతం పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రతి పింఛనుదారుడికి ఇంటి వద్దనే పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే చర్యలు

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరిక
- జిల్లా అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరిగితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన జిల్లాలోని సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు జరిగితే సంబంధిత వీఆర్వోలపై చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులు భవనాల శాఖకు చెందిన భూములు, బంజరు భూములు, గ్రామ కంఠం భూములు దురాక్రమణ జరగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. పోరంబోకు స్థలాలు అక్రమణకు గురైతే జరిగితే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల వారీగా ప్రభుత్వ భూములను ఆడిట్ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆక్రమణలపై సమగ్రంగా సర్వే చేసి సర్వే నంబర్లను గుర్తించాలని అన్నారు. డిసెంబర్ నెలాఖరులోగా ల్యాండ్ ఆడిట్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాడేరులో అంబేడ్కర్ విగ్రహం పరిసరాల్లోని ఆక్రమణలు తొలగించి చిరు వ్యాపారులను రైతు బజారుకు తరలించాలని ఆదేశించారు. ఆక్రమణలు జరిగితే సంబంధిత వీఆర్వోను సస్పెండ్ చేస్తామన్నారు. వారపు సంతల్లో ప్రభుత్వ భూములను గుర్తించి షెడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించి ప్రతిపాదించాలని ఆయన సూచించారు. రంపచోడవరం రెసిడెన్షియల్ స్కూల్ సమీపంలోని భూమిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. వచ్చేనెల 3,4 తేదీల్లో వీఆర్వోలు, ఆర్ఐలకు రెవెన్యూ చట్టాలపై శిక్షణ అందిస్తామని అన్నారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ, చింతూరు పీవో అపూర్వ భరత్ పాల్గొన్నారు.

గిరిజనేతరుల పెత్తనం సహించం

- ఆదివాసీల అభివృద్ధికి అడ్డుపడే వారిపై అట్రాసిటీ కేసులు పెడతాం
- మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని రాజకీయాల నుంచి తరిమి కొట్టాలి
- ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామారావు దొర



మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ నేత రామారావు దొర

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో ఆదివాసీల అభివృద్ధికి గిరిజనేతరులు అడ్డుపడితే ఉపేక్షించేది లేదని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. టీడీపీ బీసీ సెల్ నాయకుడు పొలువర్తి గోవింద్, వర్తక సంఘం అధ్యక్షుడు ఇమిడిశెట్టి అనిల్, నాయుడు (సిమెంట్ షాపు) చందు (కృష్ణా ఫ్యాన్సీ), నాళం శ్రీనుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని తెలిపారు. గిరిజనేతరులు ఐదో షెడ్యూల్ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. శాశ్వత నివాసాలు, వ్యాపార సముదాయాలు కలిగి ఉండటమే కాకుండా ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని బాహాటంగా అడ్డుకుంటున్న వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదివాసీల ప్రతినిధిగా కాకుండా, మొదటి నుంచి కొంతమంది గిరిజనేతరులకు బానిసలా వ్యవహరిస్తూ ఆదివాసీ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి వారిని శాశ్వతంగా రాజకీయాల నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధిత గిరిజనుల కష్టాలు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి కనిపించలేదన్నారు. ఏజెన్సీలో ఏ హక్కులు లేని గిరిజనేతరుల వ్యాపారుల పక్షాన అమరావతికి వెళ్లడం ఆదివాసీలకు ద్రోహం చేయడమేనన్నారు. 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టాన్ని తుంగలోకి తొక్కి, రాజకీయ గురువు పొలుపర్తి గోవింద్ అనే గిరిజనేతరుడికి సినిమా హాలులో వాటా రాసిచ్చారని ఆరోపించారు. హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన ఆదివాసీల కోసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పాడేరు ఏజెన్సీని గంజాయి, నల్లబెల్లం వంటి చీకటి వ్యాపారాలకు అడ్డాగా మార్చి కోట్లకు పడగలెత్తిన వారిపై సుమోటాగా అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కలెక్టర్, ఎస్పీలను ఆయన కోరారు. గిరిజనేతరుల ఆగడాలను అడ్డుకునేందుకు ఆదివారం నిర్వహించనున్న సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కాసులకోసం కక్కుర్తి పడి చట్టాల ఉల్లంఘనకు పాల్పడే రాజకీయ నేతలను ఉపేక్షించవద్దని ఆదివాసీలను ఆయన కోరారు.

అన్నదాత వర్రీ

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వరి, రాగులు, సామలు, కొర్ర ఉత్పత్తులు చేతికందే సమయంలో పంటంతా నీటి పాలవుతోందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డామని, ఇప్పుడు తడిచిపోతే పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఉంటుందని వారు వాపోతున్నారు.

- తుపాను కారణంగా వర్షాలు
- తడిచిపోతున్న వరి, చిరుధాన్యాల పంటలు
- ఆందోళన చెందుతున్న గిరి రైతులు

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో వాయుగుండం కాస్తా తుపానుగా మారడంతో ఏజెన్సీ వ్యాప్తంగా శనివారం వర్షం కురిసింది. ఖరీఫ్, వరి, చిరుధాన్యాల పంటలు తడుస్తుండటంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన వరి పనలను పొలాల్లోంచి సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు పెడుతున్నారు. వాటిపై టార్పాలిన్లు కప్పుతున్నారు. రాగులు, సామలు, కొర్ర పంటలు కోతదశలో ఉన్నందున వర్షంతో నష్టం తప్పదని గిరిజన రైతులు వాపోతున్నారు. శనివారం జిల్లాలో అనంతగిరిలో 18.4, చింతపల్లిలో 5.4, పాడేరులో 2.8, హుకుంపేటలో 2, డుంబ్రిగుడలో 2.4, జి.కే.వీధిలో 1.6, కొయ్యూరులో 1.4, అడ్డతీగలలో 1.2, పెదబయలులో 0.4, రంపచోడవరంలో 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

చింతపల్లి: తుపాను ప్రభావంతో ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం అరుకువేలిలో 17.7 డిగ్రీలు, జి మాడుగులలో 18.3 డిగ్రీలు, చింతపల్లి, డుంబ్రిగుడలో 18.5 డిగ్రీలు, హుకుంపేటలో 18.8 డిగ్రీలు, పెదబయలులో 18.9 డిగ్రీలు, అనంతగిరి, జీకేవీధిలో 19.3 డిగ్రీలు, పాడేరులో 19.1 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 20.5 డిగ్రీలు, కొయ్యూరులో 20.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈవిషయాన్ని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో శనివారం వర్షం ఎక్కువైంది. దీంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. రంపచోడవరం డివిజన్‌లో సుమారు 6,200 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టారు. సుమారు 11,550 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు దేవీపట్నం మినహా మిగతా ఏడు మండలాల్లో 30శాతం మేర కూడా వరి కోత పనులు పూర్తి కాలేదు. ఈ పరిస్థితుల్లో వర్షాలు తగ్గుముఖం పట్టకపోతే పంటపై ఆశ వదులుకోవాల్సిందేనని రైతులు వాపోతున్నారు.



ఈదురుగాలులకు రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట వద్ద నేలకు ఒరిగిన వరి పంట



పాడేరు మండలం లగిశపల్లి ప్రాంతలో తడిచిపోయిన వరి పనలు



కోట్లగరువు ప్రాంతంలో వరికుప్పలకు గిరి రైతులు కప్పిన టార్పాలిన్లు

సుందరీకరణ పనుల పరిశీలన



జలపాతం వద్ద విద్యుత్ కాంతులను పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని శనివారం రాత్రి పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న ఎల్ఈడీ లైటింగ్, సుందరీకరణ పనులతోపాటు వ్యూపాయింట్, జలపాతం వద్ద రక్షణ చర్యలను ఆయన పరిశీలించారు. సందర్శకులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు పీవో సూచించారు.

వర్షంలోనూ పర్యాటకుల తాకిడి



అరకు రైల్వేస్టేషన్‌లో భారీగా పర్యాటకులు



వర్షంలో చాపరాయి ముఖద్వారం వద్ద పర్యాటకులు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయకు శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. వీకెండ్ కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియం, ఇతర సందర్శిత ప్రాంతాలు కళకళలాడాయి. అరకు రైల్వేస్టేషన్ పరిసరాలు సందడిగా మారాయి. తుపాను ప్రభావం ఉన్నప్పటికీ చాపరాయి జలపాతానికి పర్యాటకులు భారీగానే తరలివచ్చారు. స్నానాలు చేస్తూ సందడి చేశారు. బేంబూ బిర్యానీ, బేంబూ చికెన్ అమ్మకాలు ఎక్కువగానే జరిగాయి. అరకు పైనరీ పర్యాటకుల రాకతో సందడిగా మారింది. కురిడి వద్ద పొద్దుతిరుగుడు తోటల్లో పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.



చాపరాయి జలపాతం వద్ద వర్షంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

విద్యార్థిని మృతికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలి


ప్రిన్సిపాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మీ

అరకులోయటౌన్: మండలంలోని యండపల్లివలస గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతూ మృతి చెందిన జన్ని ప్రియాంక(11) మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి డిమాండ్ చేశారు. ఆమె శనివారం గురుకులం పాఠశాలకు వెళ్లి ప్రియాంక మృతికి గల కారణాలను ప్రిన్సిపాల్‌కు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో వంట కుక్‌లను నియమించాలని, మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనాలు వండి వడ్డించాలన్నారు. పాఠశాలలో హెల్త్ వర్కర్స్‌ని నియమించాలన్నారు.

పరిశుభ్రత పాటించాలి

పాఠశాలలో వంటశాల, స్టోర్ రూమ్, విద్యార్థుల నివాస గదులను పరిశీలించారు. ప్రతీ రోజు వంటశాల, డైనింగ్ హాల్, మరుగుదొడ్లను బ్లీచింగ్, ఫినాయిల్‌తో శుభ్రం చేయాలని వసతి గృహం నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండలంలోని కొత్తభల్లుగుడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలుపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆమె వెంట శోభ సోమేశ్వరి తదితరులున్నారు.



పాడేరులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు


సీలేరులో మానవహారంగా విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం

అరకులోయటౌన్: ప్రపంచ ఎయిడ్స్ డేను డిసెంబర్ 1న నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో ముందస్తుగా శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అవగాహన ర్యాలీలు చేపట్టారు. విద్యార్థులు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. రెడ్ రిబ్బన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యావేత్తలు, పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా అడ్వకేట్ బుజ్జిబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అకౌంట్, పిన్, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, పట్టాసి చలపతిరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, అనితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పరాజు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): పాడేరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి , ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ పాపారత్నం, రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ దామోదార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: మర్రిపాలెం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సుధ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీవో డి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వసుధ, వైస్ ప్రిన్సిపాల్ కేజీ వెంకటేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరులో మానవహారం నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న అడ్వకేట్ బుజ్జిబాబు


అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు


రంపచోడవరంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు

కేజీహెచ్‌కు ఆశ్రమ విద్యార్థి తరలింపు

తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంపించిన ఐటీడీఏ పీవో అభిషేక్


పాడేరు జిల్లా ఆస్పత్రిలో విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: రక్తహీనతతో బాధపడుతూ స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థిని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శనివారం దగ్గరుండి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ముంచంగిపుట్టు మండలం బాబుశాల పంచాయతీ గాజులబందకు చెందిన గొల్లోరి వంశీ (14) మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల–2లో 9వతరగతి చదువుతున్నాడు. రక్తహీనతతో బాధపడుతున్నాడని భావించిన అధికారులు విద్యార్థి వంశీని శనివారం పాడేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యపరీక్షలు నిర్వహించారు. గుండె సమస్యతో బాధపడుతున్నట్టు నిర్ధారణ కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. అందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. వెంటనే సమాచారాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆయన జిల్లా ఆస్పత్రిని తక్షణమే సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను ఒప్పించారు. ప్రత్యేక అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు పంపించారు. అనంతరం ఆయన ట్రైబల్ సెల్ అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వార్డెన్ రాంబాబును విద్యార్థి వెంట వెళ్లాలని ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణను అడ్డుకోవద్దు

పాడేరులో శాంతియుతంగా గిరిజనుల ప్రదర్శన

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులోని రోడ్ల అభివృద్ధికి వర్తకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, అడ్డకునే చర్యలకు దూరంగా ఉండాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు. పాడేరు పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి వర్తకసంఘంలోని కొంతమంది అడ్డుతగులుతున్నారని ఆరోపిస్తూ వారు శనివారం రాత్రి వర్తక సంఘం నేత ఎస్. శ్రీనివాస్ దుకాణం ఎదుట శాంతియుత నిరసన చేపట్టారు. రోడ్ల అభివృద్ధిని అడ్డుకోవద్దని నినాదాలు చేశారు.

అభివృద్ధికి సహకరిస్తాం: వర్తక సంఘం నేతలు

పాడేరు పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి వర్తక సంఘం సహకరిస్తుందని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇమ్మిడిశెట్టి అనిల్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.పాడేరు పట్టణంలోని రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వ నిర్ణయం మేరకు విస్తరణ చేయవచ్చన్నారు. పాడేరులో రోడ్ల అభివృద్ధికి వర్తక సంఘం ఎలాంటి అడ్డంకులు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం వారు నిర్ణయించిన మేరకు భవనాలను తొలగించుకునేందుకు వర్తకులమంతా సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

ఉరి వేసుకొని యువకుడు మృతి


సుబ్రహ్మణ్యం (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలో గల దార్రెల పంచాయతీ కేంద్రానికి చెందిన చెండా సుబ్రహ్మణ్యం(33) అనే గిరిజన యువకుడు ఉరి వేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దార్రెల గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం మామిడి చెట్టుకు సుబ్రహ్మణ్యం ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీనిని గమినించి స్థానికులు హుటాహుటిన పరుగులు పెట్టి చేసే సరికే సుబ్రహ్మణం మృతి చెంది ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతికి గల వివరాలు సేకరించారు. మతిస్థిమితం సరిగా లేక ఇలా చేసుకొని ఉంటాడని కొంతమంది చెప్పగా.. ప్రేమ విఫలమై మానసిక బాధతో ఉరి వేసుకొని ఉంటాడని మరికొందరు చెప్పారు. ఈ ఘటనపై ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి


జ్యోతి (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ సంగడ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి(20) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. పాడేరులోని మోదమాంబ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఆమె కొద్దిరోజులుగా గొంతు, శ్వాస సమస్యతో బాధపడుతోంది. ఆమెను తల్లిదండ్రులు ప్రధాన అర్జున్, కౌసల్య ఈ నెల 23న ఒడిశాలోని ఆశా కిరణ్ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో అక్కడ నుంచి విశాఖ తీసుకువచ్చి కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ వైద్యసేవలు పొందుతూ శనివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఆమె మృతి చెందింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె మృతదేహానికి సంగడ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి, సీపీఎం నేత శంకర్‌రావు, వైఎస్సార్‌సీపీ మండల నేత దేవ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గిరిజన ప్రాంతంలో తరచూ విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కళాశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యాయని వారు ఆరోపించారు. హెల్త్ వర్కర్ల నియామకంలో నిర్లక్ష్య చేస్తోందన్నారు. విద్యార్థిని జ్యోతి కుటుంబానికి 10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.


చికిత్స పొందుతూ మృతి చెందిన జ్యోతి

ఏవోబీలో రెడ్ అలర్ట్

- రేపటి నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు
- జల్లెడపడుతున్న పోలీసు బలగాలు
- ముమ్మరంగా తనిఖీలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దులో డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబిరేషన్ గెరిల్లా ఆర్మీ) వారోత్సవాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తనిఖీలు ముమ్మరం చేసింది. గతంతో పోలిస్తే ఏవోబీలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గినప్పటికీ, వారోత్సవాలను భగ్నం చేసేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.

- ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఆంధ్ర,ఒడిశా పోలీసు బలగాలు మోహరించాయి. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను తనిఖీ చేసి, అనుమానితుల వివరాలు సేకరించి విడిచి పెడుతున్నాయి.
- ఆంధ్ర ఒడిశా సరిహద్దులో కొన్నేళ్లుగా మావోయిస్టులకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు బలగాలు విస్తృత కూంబింగ్‌లతో నిర్బంధ పరిస్థితులను ఎదుర్కొంటోంది. దీంతో పాటు లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.
- ఆంధ్రాలోని రూడకోట ఆవుట్ పోస్ట్ ఏర్పాటుతో పాటు ఒడిశాలోని జోడం,గుర్రశెట్టి,గుమ్మ వంటి ప్రాంతాల్లో ఒడిశా పోలీసులు ఆరు ఆవుట్ పోస్టులను ఏర్పాటు చేశారు.దీంతో మావోయిస్టుల కంచుకోటగా ఉండే ఏవోబీ ప్రాంతం పూర్తిగా పోలీసుల గుప్పిట్లో ఉంది.
- ఏవోబీ సరిహద్దులోని మారుమూల అటవీ ప్రాంతాల్లో పోలీసు బలగాలు కూంబింగ్ మొదలుపెట్టాయి. గిరిజన గ్రామాల్లో సైతం గాలింపు విస్తృతం చేశాయి. మండల కేంద్రాల్లో వారోత్సవాలు ముగిసేంత వరకు తనిఖీలు నిర్వహించడం, రాత్రిపూట పెట్రోలింగ్ చేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ ఏర్పాటుచేస్తున్నారు.
- మారుమూల గిరిజన గ్రామాల్లో జరుగుతున్న రోడ్ల పనులకు సంబంధించి జేసీబీలు, పొక్లెయిన్లు, ట్రాక్టర్లు వంటి వాహనాలను మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. వారోత్సవాలు ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని అన్ని పోలీసుస్టేషన్లకు జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు అందాయి.


ఏవోబీలో గాలింపులు చేపడుతున్న పోలీసు బలగాలు

వరిలో రెల్ల రాల్చు పురుగుపై అప్రమత్తత అవసరం

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో రెల్ల రాల్చు పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు పొలానికి ముందుగా నీరు పెట్టి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ, వేప నూనె 5.0 మి.లీ లీటరు నీటిలో సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోసిన పంటపై పురుగు ఆశిస్తే 1500 పీపీఎం వేపనూనెను లీటరు నీటికి 5 మి.లీ చొప్పున కలిపి పనలపైన, పనలు తిప్పి పిచికారీ చేయాలన్నారు. వరి కోత దశలో ఉన్నా వర్ష సూచన కారణంగా కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే పైరును కోసి ఉంటే కుప్పలుగా పెట్టుకుని టార్పిలిన్ కప్పాలని సూచించారు. బెల్లం తయారీ రైతులు పంచదార శాతం కింది కణుపులలో ఎక్కువగా ఉంటుందని, కాబట్టి చెరకును నేలకు దగ్గరగా నరకాలని, చెరకు నరకిన 24 గంటలలోపు బెల్లం ఆడుకోవాలన్నారు. రబీలో వేరుశనగ వేసే రైతులు అధిక దిగుబడినిచ్చే మేలైన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ, 4 మి.లీల నీళ్ల కిలో విత్తనానికి కలిపిన తరువాత టెబుకొనజోల్ 2 శాతం డీఎస్‌ను కిలో విత్తనానికి 1 గ్రా. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. దుక్కిలో 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 35 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. పేను విత్తిన 3 రోజులలోపు ఎకరానికి ఒక లీటరు పెండిమిథలిన్‌ను పిచికారీ చేసి కలుపును నివారించవచ్చన్నారు.

అనంతుని లోగిలి.. దీపకాంతుల సిరి


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

పద్మనాభం: రాష్ట్రంలో విశిష్టతను సంతరించుకున్న అనంత పద్మనాభుని దీపోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. తైల దీపాలు వెదజల్లిన సింధూర వర్ణపు కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్యమానంగా వెలుగొందింది. అనంతుని దీపోత్సవ దీప్తి దశ దిశలా వ్యాపించి భక్తులకు ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కల్పించింది. గిరి శిఖరంపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటల నుంచే భక్తుల రావడం ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పద్మనాభం రోడ్లన్నీ భక్త జన సందోహంతో నిండిపోయాయి. తుపాన్ ప్రభావం వల్ల వర్షం కురిసినా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన భక్తులు అనంతుని పాద సన్నిధిలో దీపారాధన చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంత పద్మనాభస్వామి చిన్న ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరుల నాద స్వరాల నడుమ తొలి పావంచా వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి పావంచా వద్ద కొలువు దీరిన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు జేగంట మోగగానే భక్తులు 1,200 మెట్లు కిరువైపులా తైల దీపాలు వెలిగించారు. తైల దీపాలంకరణతో అనంత పద్మనాభుని గిరికి సిందూర తోరణాలు అద్దినట్టు సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన చిడతలు, తప్పెటగుళ్లు, పులివేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి.


తరలివచ్చిన భక్తజనం